కార్మికులపై వివక్ష ఎందుకో?

- ఈపీఎఫ్ లేకపోవడంతో నష్టపోతున్న కార్మికులు
- ప్రమాదాల్లో మరణిస్తే కుటుంబాలకు కోలుకోలేని దెబ్బ



పారిశుద్ధ్య కార్మికులు (ఫైల్)

పాల్వంచ: పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో నిరంతరం మున్సిపాలిటీ పారిశుద్ధ్య సిబ్బంది శ్రమిస్తుంటారు. రోడ్లు ఊడ్చడం, కాల్వల్లో మురుగు తొలగించడం, రోడ్ల పక్కన చెత్తాచెదారం లేకుండా శుభ్రం చేయడం, ఇంటింటికీ తిరిగి చెత్త సేకరణ చేయడం, వంటి అనేక రకాల పనులు చేస్తుంటారు. కానీ కనీస సౌకర్యాలు కల్పించడంలో అధికారులు వివక్ష చూపిస్తున్నారని కార్మికులకు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపాలిటీలో కార్మికుల కొరత ఉన్నప్పటికీ ఉన్న వారితోనే పట్టణం మొత్తం పారిశుద్ధ్య పనులు చేయిస్తున్నారు. వీరికి వేతనాన్ని నేరుగా ఖాతాల్లో వేసి చేతులు దులుపుకుంటున్నారు. ఏ ఇతర బెనిఫిట్స్ కూడా అందని పరిస్థితి ఉంది. దీంతో కార్మిక కుటుంబాలు తీవ్రంగా నష్టపోతున్నాయి. పాల్వంచ మున్సిపాలిటీలో మొత్తం 116 మంది శానిటేషన్ విభాగంలో విధులు నిర్వహిస్తున్నారు. కాగా జవాన్లతో పాటు మొత్తం 12 మంది మాత్రమే పర్మనెంట్ కార్మికులు ఉన్నారు. మిగతా వారంతా కాంట్రాక్ట్ కార్మికులుగానే పనిచేస్తున్నారు. ఇక ఇల్లెందులో కాంట్రాక్ట్ కార్మికులు 58, మణుగూరులో 53 మంది, కొత్తగూడెంలో 176 మంది కాంట్రాక్ట్ కార్మికులు ఉన్నారు. ఈ మున్సిపాలిటీల్లో ఈపీఎఫ్‌ను చెల్లిస్తున్నారు. అయితే చెల్లింపులకు సంబంధించి ఎలాంటి ఆధారాలు మాత్రం కార్మికులకు అందజేయడం లేదని కార్మికులు వాపోతున్నారు.

సౌకర్యాలు లేక రోడ్డున పడుతున్న కార్మికులు...

కాంట్రాక్ట్ కార్మికులకు నెలకు రూ.13 వేల నుంచి రూ.16వేలు మాత్రమే మెప్మా ద్వారా బ్యాంక్ నుంచి ఖాతాల్లో వేతనాలు వేస్తున్నారు. అయితే ఈ వేతనాలు తప్ప ఏ ఇతర సౌకర్యాలు వీరికి లభించడం లేదు. ఈపీఎఫ్, ఇన్సూరెన్స్ సైతం కట్టకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కార్మికులు ఆరోపిస్తున్నానరు. గత అక్టోబర్ 13న జయమ్మ కాలనీకి చెందిన వల్లపు వెంకటేశ్వర్లు గుండె పోటుతో మృతి చెందాడు. 16న విధుల్లో రోడ్డు పక్కన చెత్త ఎత్తుతున్న వడ్లకొండ కవిత అనే కార్మికురాలిని కారు ఢీకొట్టడంతో మృతి చెందింది. ఇలా ప్రమాదాల్లో, అనారోగ్యాల సమస్యలతో చనిపోతున్న కార్మికులు తీవ్రంగా నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈపీఎఫ్ చెల్లించాలని ఏళ్ల తరబడి అధికారులను వేడుకుంటున్నా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇక దహన సంస్కారాలకు సైతం కనీసం ఆదుకోవడం లేదని పలువురు కార్మికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాల పెంపు, ఈపీఎఫ్, చనిపోయిన కార్మికుల కుటుంబాల్లో ఒకరి ఉద్యోగం, ఇన్సూరెన్స్, యూనిఫాం, కొబ్బరి నూనె, సబ్బులు, ఇతర సౌకర్యాలన్నీ సకాలంలో అందించాలని కోరుతున్నారు.

ఈపీఎఫ్‌ను పరిశీలిస్తాం..



మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బందికి ఈపీఎఫ్ కొందరికి రావడం లేదని నా దృష్టికి వచ్చింది. ఈ విషయం పరిశీలిస్తాం. వారికి అందాల్సిన సౌకర్యాలు అందేలా చూస్తాం.

– ఎ.స్వామి, మున్సిపల్ కమిషనర్

నా జీవితం ప్రజలకే అంకితం: వనమా


పాల్వంచ మండలంలో ప్రచారం చేస్తున్న వనమా


పాల్వంచ: ఎంపీ రవిచంద్ర సమక్షంలో పార్టీలో చేరిన నాయకులు

పాల్వంచ: నా జీవితం నియోజకవర్గాని అంకితం అని, తాను రాజకీయాల్లోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు ఇక్కడి ప్రజలను అంటిపెట్టుకుని కష్ట సుఖాల్లో పాలుపంచుకుంటున్నానని ఎమ్మెల్యే, బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి వనమా వెంకటేశ్వర రావు అన్నారు. సోమవారం మున్సిపాలిటీలోని శేఖరం బంజర, యానంబైల్, కిన్నెరసాని, తదితర పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కేసీఆర్ పథకాలు ప్రతీఇంటికి అందినట్లు చెప్పారు. ముఖ్యంగా రైతులను ఆదుకోవడం జరిగిందన్నారు. వెనుకబడిన వర్గాల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. రానున్న ఐదేళ్లలో నియోజకవర్గాన్ని రెట్టింపు అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. ఇప్పటికే కేసీఆర్ నియోజకవర్గానికి అనేక నిధులు కేటాయించారని, ఆ నిధులతో పలు అభివృద్ధి పనులు పూర్తి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సరస్వతి, వెంకన్న పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక...

పాల్వంచ: బీఆర్ఎస్ నాయకుడు ఎడవల్లి కృష్ణ గృహంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాగారం కాలనీకి చెందిన పలువురు బీఆర్ఎస్ పార్టీలో చేరారు, వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కాపా శ్రీనివాసరావు, చాంద్‌పాషా, వీరు నాయక్, సూర్యకిరణ్, పార్టీలో చేరిన నాయకులు మోహన్ రావు, రవికుమార్, కృష్ణ, పవన్, ఉమేశ్, సురేశ్, భీముడు, వీరు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన శివారెడ్డి..

పీసీసీ ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ముఖ్య అనుచరుడు తుమ్మల శివారెడ్డి బీఆర్ఎస్‌లో చేరారు. సోమవారం ఎంపీ వద్దిరాజు రవిచంద్ర సమక్షంలో బీఆర్ఎస్ కండువా కప్పుకున్నారు. వనమా రాఘవేందర్‌రావు, కోనేరు చిన్ని, మున్సిపల్ చైర్మన్ కాపు సీతాలక్ష్మి, వైస్ చైర్మన్ వేల్పుల దామోదర్, ఎడవల్లి నవీన్ కుమార్, రజాక్, చందు తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడెంఅర్బన్: పని చేసే ప్రభుత్వాన్ని మళ్లీ ఆదరించాలని కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మీ అన్నారు. సోమవారం వార్డుల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించి కరపత్రాలు పంపిణీ చేశారు. మరికొన్ని వార్డుల్లో వాల్ పోస్టర్లు వేస్తూ ప్రచారం చేశారు. కొత్తగూడెం ప్రస్తుతం అన్నీ రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు దూసుకవెళ్తుందని, మరింతా అభివృద్ధి జరుగలంటే బీఆర్ఎస్ అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావుకు ఓటు వేసి గెలిపించాలన్నారు. ప్రతి ఇంటికి ఉపయోగపడే ఎన్నో సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిందని, రానున్న రోజుల్లో మరిన్నీ ప్రవేశపెట్టి తెలంగాణను రోల్‌మోడల్‌గా కేసీఆర్ తీర్చిదిద్దుతారని వివరించారు. వైస్ చైర్మెన్ దామోదర్, సాహేరబేగం, మోరె రూప, అజ్మీరా సుజాత, విజయలక్ష్మి, అఫ్జలున్నీసా బేగం, వనచర్ల విమల, మదా సత్యవతి, గుమ్మడేల్లి కళ్యాణి, నాయకులు కాపు కృష్ణ, మహ్మద్ యూసఫ్, పూర్ణ,పిడుగు శ్రీను పాల్గొన్నారు.

ప్రజల ఆశీర్వాదంతో విజయం సాధిస్తా: హరిప్రియ




ఇల్లెందురూరల్: ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ, గార్ల: బీఆర్ఎస్‌లో చేరిన వారికి కండువా కప్పుతున్న హరిప్రియ

ఇల్లెందురూరల్: పదవులు అనుభవిస్తున్న ప్రజాప్రతినిధులు పార్టీని వీడినా ప్రజల ఆశీర్వాదం ఉన్నందున ఈ ఎన్నికల్లో తాను విజయం సాధిస్తానని ఇల్లెందు బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ స్పష్టం చేశారు. ఇల్లెందు మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం ఎన్నికల ప్రచారం చేసిన ఆమె మాట్లాడుతూ దశాబ్దాల ఎదురుచూపులకు తెరదించేలా మారుమూల గ్రామాలకు బీటీ రోడ్లు, గ్రామాల్లో వీధుల్లో సీసీ రోడ్లు వేయించానని తెలిపారు. తాను చేసిన అభివృద్ధి పనులను గుర్తించి ఆదరిస్తున్నట్లుగానే కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. జెడ్పీటీసీ ఉమాదేవి, నాయకులు శీలం రమేష్, ఖమ్మంపాటి రేణుక, కమల, ప్రమోద్, గాజీ, ఊకే లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లో చేరిక

టేకులపల్లి/గార్ల: గతంలో ఎవరూ చేయని తరహాలో అభివృద్ధి చేసిన తనను మరోమారు గెలిపించాలని హరిప్రియ కోరారు. టేకులపల్లి మండలం గోలియాతండాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడగా కాంగ్రెస్, బీజేపీకి చెందిన బోడ ప్రసాద్, మూడు శోభన్, బోడ రవి, భూక్యా ప్రవీణ్, బోడ హుస్సేన్, నరేష్, చందర్, సరిలాల్, బిచ్చు, సక్రు, మణిశర్మ, బాణోతు గణేష్ తదితరులు బీఆర్ఎస్‌లో చేరగా ఆమె ఆహ్వానించారు. నాయకులు బొమ్మెర వరప్రసాద్, బోడ బాలు, చీమల సత్యనారాయణ, మాలోతు రాజేందర్, కిషన్, బాలు, మౌలానా, వీరు పాల్గొన్నారు. ఇక గార్ల మండలంలోని బాలాజీతండాలో కాంగ్రెస్ పార్టీ నుంచి 50 కుటుంబాలు ఇల్లెందు ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ సమక్షాన బీఆర్ఎస్‌లో చేరారు. మాజీ సర్పంచ్ మంగ్యా, ఉపసర్పంచ్ వీరన్న, వార్డు సభ్యులు సురేష్, కోమల, శంకర్, పంతుల్య, వెంకటేశ్వర్లు, తదితరులు పార్టీలో చేరగా, జెడ్పీ చైర్ పర్సన్ బిందు, సర్పంచ్ శంకర్ పాల్గొన్నారు.

నాయకుల విస్తృత ప్రచారం

ఇల్లెందు/బయ్యారం/గార్ల: ఇల్లెందులోని పలు వార్డుల్లో బీఆర్ఎస్ అభ్యర్థి బానోతు హరిప్రియను గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ నాయకులు ప్రచారం చేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగాల రాజేందర్‌తో పాటు మడత వెంకట్‌గౌడ్, జానీపాషా, రంగనాథ్, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఇక బయ్యారం మండలంలోని జగ్గుతండాలో జరిగిన ప్రచారంలో జెడ్పీ చైర్ పర్సన్ అంగోతు బిందు మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీకు ఓట్లు వేస్తే ఉపయోగం ఉండదని తెలిపారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి బీఆర్ఎస్‌ను ఆదరంచాలని కోరారు. నాయకులు వెంకట్ కృష్ణ, సురేష్, రమేష్, శ్రీనివాస్, జావీద్, బీమానాయక్ పాల్గొన్నారు. కాగా, గార్లలో నాయకులు గంగావత్ లక్ష్మణ్‌నాయక్, లింగా ఉమేష్, శీలంశెట్టి రమేష్, భాస్కర్‌రావుప్రచారం చేశారు.

క్లుప్తంగా

రేపు కొత్తగూడెంకు 'ఈటల'

చుంచుపల్లి: బీజేపీ ఎన్నికల ప్రచార కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ బుధవారం కొత్తగూడెంలో జరిగే ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని ఎమ్మెల్సీ వైఎం సతీష్, జిల్లా అధ్యక్షుడు కేవీ రంగాకిరణ్ తెలిపారు. చుంచుపల్లి హౌసింగ్ బోర్డులోని జనసేన కార్యాలయంలో సోమవారం జరిగిన బీజేపీ, జనసేన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. కొత్తగూడెం బీజేపీ, జనసేన అభ్యర్థి లక్కినేని సురేందర్‌రావు తరపున ఈటల ప్రచారానికి వస్తుండగా, విజయవంతం చేయాలని కోరారు. యడ్లపల్లి శ్రీనివాస్ కుమార్, తిమిరి నరేంద్రబాబు, దర్శనపు శ్రీనివాసరావు, రాయుడు నాగేశ్వరరావు, మాలోత్ గాంధీ, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

నవభారత్: నేడు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏడీఈ, ఓపీ కొత్తగూడెం పి.హేమచంద్రబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా రామవరం, చిట్టి రామవరం, 2ఇంక్లైన్, గరిమెళ్లపాడు ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

సర్వశక్తులూ ఒడ్డుతున్న నాయకులు

టేకులపల్లి: టేకులపల్లి మండలంలోని 36 గ్రామ పంచాయతీల్లో సోమవారం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బానోతు హరిప్రియ, కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోరం కనకయ్య, బీజేపీ ఎమ్మెల్యే ధరావత్ రవీంద్ర నాయక్, బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి బాదావత్ ప్రతాప్, సీపీఎం ఎమ్మెల్యే అభ్యర్థి దుగ్గి కృష్ణ, స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థులు గుమ్మడి అనురాధ, గుగులోత్ భద్రు, జారె భిక్షమయ్య, చీమల వెంకటేశ్వర్లు తదితరుల తరపున నాయకులు, కార్యకర్తలు ఇంటింటి ప్రచారం చేశారు. వారి వారి ఎన్నికల గుర్తులను చూపిస్తూ ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

మహిళా ఓటర్లే అధికం



జూలూరుపాడు: జూలూరుపాడు మండలంలో పురుషులు కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. ఈనెల 16న ఓటర్ల తుది జాబితా విడుదలైనట్లు తహసీల్దార్ శారద ఇటీవల తెలిపారు. తుది ఓటర్ల జాబితా ప్రకారం.. మండలంలో మొత్తం ఓటర్లు 27,632 మంది ఉన్నారు. వీరిలో పురుషులు 13,614 మంది కాగా, మహిళా ఓటర్లు 14,018 మంది ఉన్నారు. పురుషులు కంటే మహిళా ఓటర్లు 402 మంది అధికంగా ఉన్నారు. మండలంలో మొత్తం 36 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఆయా కేంద్రాల నంబర్ 62 నుంచి 97 వరకు ఉన్నాయి. భేతాళపాడులో 65, 66 పోలింగ్ కేంద్రాలు ఉండగా 65లో అత్యధికంగా 1232 మంది ఓటర్లు ఉండగా, అత్యల్పంగా పోలింగ్ కేంద్రం 90 (నల్లబండబోడు)లో 149 మంది ఓటర్లు మాత్రమే ఉన్నారు. ఈనెల 30న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటు హక్కు తప్పకుండా వినియోగించుకోవాలని తహసీల్దార్ కోరారు. ఆయా పోలింగ్ కేంద్రాలలో 30న జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధిత అధికారులు.. ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు, ఉద్యోగులకు సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నటు చెప్పారు. అదేవిధంగా ఓటర్లకు తాగునీరు, మరుగుదొడ్లు, వికలాంగులకు ప్రత్యేక ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

బీఆర్ఎస్ పాలనకు చరమగీతం..


సీపీఐ కార్యాలయంలో అభివాదం చేస్తున్న కూనంనేని, ప్రజా, దళిత సంఘాల నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): ప్రజలను మాయమాటలతో నమ్మిస్తున్న బీఆర్ఎస్ పాలనకు చరమగీతం పాడాలని కాంగ్రెస్ బలపరిచిన కొత్తగూడెం నియోజకవర్గ సీపీఐ ఎమ్మెల్యే అభ్యర్థి కూనంనేని సాంబశివరావు అన్నారు. సోమవారం కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దళిత సంఘాల నాయకులు, సింగరేణి కాలరీస్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు కూనంనేనికి సంఘీభావం వ్యక్త పరిచిన అనంతరం కూనంనేని మాట్లాడారు. కాంగ్రెస్, సీపీఎం, టీజేఎస్, సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా పార్టీలు, బలపరచటం ఆనందంగా ఉందని, ప్రశాంతతకు మారుపేరుగా ఉన్న కొత్తగూడెం నియోజకవర్గాన్ని కొంతకాలగా అశాంతి రాజ్యమేలుతోందన్నారు. మిత్రపక్షాలు బలపరిచిన సీపీఐ గాలి వీస్తున్నందుకున అక్రమార్కులు కొట్టుకుపోవటం ఖాయమన్నారు. కూసపాటి శ్రీనివాస్, ఆంతోటి నాగేశ్వరరావు, ఎస్‌కే సాబీర్‌పాష, హన్మంతు, మాజీ ఎంపీపీ సలిగంటి శ్రీనివాస్, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే సుఖసంతోషాలు..

ఈసారి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే ప్రజలు సుఖసంతోషాలతో ఉంటారని కూనంనేని సాంబశివరావు అన్నారు. సోమవారం కార్మిక ప్రాంతాలైన రామవరం, 14 నెంబర్, 3 ఇంక్‌లైన్, 4 ఇంక్లైన్, 2 ఇంక్‌లైన్, సుబాస్ చంద్రబోస్ నగర్, మేషన్ కాలనీ, చిట్టి రామవరంతో పాటు పలు ప్రాంతాల్లో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆరు గ్యారెంటీలు నూటికి నూరుశాతం అమలు చేసి తీరుతారని చెప్పారు. నాగసీతారాములు, కంచర్ల జమలయ్య, మునిగడప పద్మ, బానోత్ శ్రీను పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పాలనలో విసిగిపోయారు: కోరం కనకయ్య


కామేపల్లి: ప్రచార ర్యాలీలో పాల్గొన్న కోరం కనకయ్య, నాయకులు


టేకులపల్లి: పార్టీలో చేరిన వారితో కనకయ్య

కామేపల్లి: రాష్ట్రంలో బీఆర్ఎస్ పాలనతో ప్రజలు విసిగిపోయారని ఇల్లెందు కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోరం కనకయ్య పేర్కొన్నారు. ఈనేపథ్యాన ప్రజలంతా కాంగ్రెస్‌ను గెలిపించేందుకు సిద్ధమయ్యారని ఆయన తెలిపారు. కామేపల్లి మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం ప్రచారం చేసిన ఆయన చేతి గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. తాము అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను అమలుచేస్తామని, తద్వారా అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి జరుగుతుందని తెలిపారు. డీసీసీబీ మాజీ చైర్మన్ మువ్వా విజయబాబు, నాయకులు రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, రాంరెడ్డి చరణ్‌రెడ్డి, మేకల మల్లిబాబుయాదవ్, గింజల నర్సింహారెడ్డి, ఏపూరి మహేందర్, నల్లమోతు లక్ష్మయ్య, రాంరెడ్డి జగన్నాథరెడ్డి, మద్దినేని రమేష్‌బాబు, అప్పన పిచ్చయ్య, దమ్మలపాటి సత్యనారయణ, గుజ్జర్లపూడి రాంబాబు, ఆరెం రవి, ముక్తి సాంబశివరావు, శివయ్య, లతాదేవి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

టేకులపల్లి: టేకులపల్లి మండలం కోయగూడెంకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా సోమవారం జరిగిన కార్యక్రమంలో వారికి ఇల్లెందు కాంగ్రెస్ అభ్యర్థి కోరం కనకయ్య పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూక్య దేవానాయక్ ఆధ్వర్యాన జరిగిన కిష్టారం ఎంపీటీసీ పూనెం స్వప్న సహా నాయకులు పూనెం వెంకటేశ్వర్లు, సంపత్, నాగేశ్వరరావు, రవి, విజయకుమారి, సుకుమార్, అరుణ, ప్రమీల, కృష్ణ, నాగరాజు, పాపారావు, దొడ్డ కోటేష్, కుంపటి బెంజిరావు, కంగల వెంకటేశ్వర్లు, జోగ సర్వయ్య, మాడె రవి, వంగయ్య, మడకం సోమయ్య, భీమా, ఉమేష్, భద్రు కాంగ్రెస్‌లో చేరారు. ఈకార్యక్రమంలో పూనెం సురేందర్, ఉండేటి ప్రసాద్, జాల మురళి, మాడె మధు, రాసమల్ల నర్సయ్య, లక్‌మార్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే ప్రశాంత జీవనం

ఇల్లెందు: కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే ఇన్నేళ్ల బాధలు పోయి ప్రశాంత జీవనం సాధ్యమవుతుందని ఇల్లెందు మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు తెలిపారు. కాంగ్రెస్ అభ్యర్థి కనకయ్యను గెలిపించాలని కోరుతూ మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా డీవీ మాట్లాడుతూ ఇల్లెందు పట్టణంలో ఎవరు కూడా ప్రశాంతంగా లేరని, కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిస్తేనే సమస్యలు తీరుతాయని చెప్పారు. అలాగే, ఆరు గ్యారంటీల అమలుతో అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతాయని తెలిపారు. నాయకులు ఎస్‌కే.జానీ, వారా రవి, నవీన్, ఈశ్వర్, అక్కిరాజు గణేష్, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

ముమ్మరంగా సార్వత్రిక ఎన్నికల ప్రచారం..

పాల్వంచ: తన హయాంలో జరిగిన అభివృద్ధి ప్రజలకు తెలుసు, అంతకంటే ఎక్కువగా అభివృద్ధి చేసి చూపిస్తానని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థి జలగం వెంకట్రావ్ అన్నారు. సోమవారం కేటీపీఎస్ సెంటర్, వెంగళరావు కాలనీ, రాహుల్ గాంధీనగర్, కేటీపీఎస్ కాలనీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు.

స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తాం..

పారిశ్రామిక ప్రాంతాలైన కొత్తగూడెం, పాల్వంచల్లో ఎక్కువ శాతం యువత ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్నారని, వలసలు వెళుతున్నారని వారికి ఇక్కడే ఉపాధి అవకాశాలు మెరుగు పడేలా కృషి చేస్తానని బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి యెర్రా కామేశ్ అన్నారు. సోమవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా పలు కాలనీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కోళ్లపూడి ప్రవీణ్‌కుమార్, బండి రమణి, నాగుల రవికుమార్, కేతిని కుమారి పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరికలు...

జూలూరుపాడు: భేతాళపాడు గ్రామ పంచాయతీ చీపురుగూడెం, గుండెపుడి గ్రామ పంచాయతీ వీరభద్రాపురం గ్రామానికి చెందిన 80 కాంగ్రెస్ కుటుంబాలు బీఆర్ఎస్ వైరా ఎమ్మెల్యే అభ్యర్థి బానోత్ మదన్‌లాల్ సమక్షంలో సోమవారం బీఆర్ఎస్‌లో చేరారు.అదేవిధంగా పడమటనర్సాపురం గ్రామానికి చెందిన 20 కుటుంబాలు కాంగ్రెస్ పార్టీలో చేరాయి. లేళ్ల గోపాల్‌రెడ్డి, కాజా రమేష్, దామెర్ల సుధాకర్, బచ్చల నరసింహారావు, దామెర్ల బాబు, బుర్ర కృష్ణ, దామెర్ల సంసేన్ ఉన్నారు.

సింగరేణి(కొత్తగూడెం): తెలంగాణ ఎన్నికల సందర్భంగా వివిధ పార్టీలు మేనిఫెస్టోలు ప్రకటించినా బీజేపీ మాత్రమే సింగరేణి అంశాన్ని చేర్చిందని బీఎంఎస్ జాతీయ కార్యదర్శి పి.మాధవనాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే, సింగరేణి కార్మికుల పింఛన్ల సమస్యల పరిష్కారానికి నిపుణుల కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారని పేర్కొన్నారు.

కాంగ్రెస్ మద్దతు ఇచ్చే వారిని గెలిపించుకోవాలి...

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మద్దతు ఇచ్చే పార్టీని గెలిపించుకోవాలని 1969 తెలంగాణ సమర యోధుల సంఘం నాయకులు తీర్మానం చేశారు. పట్టణంలోని సంఘం కార్యాలయంలో సోమవారం సమావేశంలో నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు వి.శాంతిరామ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఉద్యమకారులను పలు వరాలు కురిపించినట్లు వివరించారు. దాచేపల్లి వెంకటేశ్వర్లు, గౌతంచంద్ పారేక్, ఎండీ.సత్తార్, వజీం ఫారుక్, కందుల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నవభారత్: గిరిజనులను, బంజారాలను రాజకీయ పార్టీలు ఓట్ల కోసమే వాడుకుంటున్నారని ఎస్టీ సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర కోఆర్డినేటర్, లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్ నాయక్ అన్నారు. సోమవారం స్థానిక కొత్తగూడెం రైటర్ బస్తీలోని వారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా కొత్తగూడెం నుంచి పోటీ చేస్తున్న కొమరం బుచ్చయ్య దొరను గెలిపించుకుని గిరిజనుల ఆత్మ గౌరవాన్ని కాపాడుకుందామన్నారు.

టేకులపల్లి: వచ్చే ఎన్నికల్లో సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ పార్టీ కుండ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారితో గెలిపించాలని కోరుతూ సోమవారం మండలంలోని బద్దుతండా, నంద్యా తండా, తుమ్మల చలక , ముత్యాలంపాడు, కోయగూడెం, కొప్పురాయి తదితర గ్రామాలలో అభ్యర్థి మోకాళ్ల కృష్ణ ప్రచారం నిర్వహించారు. డి.ప్రసాద్, కల్తీ వెంకటేశ్వర్లు, భూక్యా హర్యా, నర్సింగు పాల్గొన్నారు.


ఇల్లెందురూరల్: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఉద్యమాలు చేసిన న్యూడెమోక్రసీ అభ్యర్థి మోకాళ్ల కృష్ణను గెలిపించాలని ఆ పార్టీ మండల ఎన్నికల కన్వీనర్ గౌని నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. మండలంలోని పోలారం, మర్రిగూడెం గ్రామపంచాయతీలలో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

ప్రభుత్వ వైఫల్యాలే బీజేపీని గెలిపిస్తాయి..

దశాబ్దకాలంగా బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలే రాష్ట్రంలో బీజేపీని గెలిపిస్తాయని బీజేపీ ఇల్లెందు ఎమ్మెల్యే అభ్యర్థి రవీంద్రనాయక్ అన్నారు. సుభాష్‌నగర్‌లో పార్టీ మండల శాఖ ఎన్నికల కార్యాలయాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. మాట్లాడుతూ.. ఎన్నికల ప్రచారంలో తమ దప్పిదాలను కప్పిపుచ్చుకునేందుకు సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ పిట్టకథలు చెబుతూ మభ్యపెడుతున్నారని ఆరోపించారు. రమేష్‌బాబు, శివకుమార్, రాంచందర్, భట్టు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందు: ప్రజాసమస్యలే ఎజెండాగా పీడితుల పక్షాల పోరాడే సీపీఎం అభ్యర్థి దుగ్గి కృష్ణను గెలిపించాలని పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు పి.సోమయ్య కోరారు. సోమవారం ఇల్లెందులో సీపీఎం ఎమ్మెల్యే అభ్యర్థి దుగ్గి కృష్ణ గెలుపును కాంక్షిస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం పెట్రోల్ బంక్ ఎదుట కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. నబీ, వజ్జా సురేష్, మోహన్‌రావు, ఆలేటి కిరణ్, శంకర్, అబ్బాస్ పాల్గొన్నారు.

ఎక్కడ చూసినా ఎన్నికల ముచ్చట్లే..



చుంచుపల్లి: నలుగురు ఒకచోట చేరితే కావాల్సినంత కాలక్షేపం దొరుకుతుంది. గతంలో అయితే కుటుంబ విషయాలైన పిల్లల చదువులు, ఉద్యోగాలు, వ్యాపారాలకు సంబంధించిన కబుర్లు ఉండేవి. కొన్ని విందు, వినోదాల అంశాలే ప్రధానంగా ప్రస్తావనకు వచ్చేవి. వారం, పది రోజులుగా ఆ ముచ్చట్లకు ఫులిస్టాప్ పడి అంతటా ఎన్నికల ఊసులే నడుస్తున్నాయి. బాయిసాబ్ ఇక్కడ ఎవరొస్తారంటావ్..., మామా... రాష్ట్రంలో ఎవరు గెలుస్తారంటావ్.., బాబాయ్ మీ అనుభవంతో చెప్పండి.. ఈసారి ఏ పార్టీ ప్రభుత్వం వస్తది.. అంటూ కొత్తగూడెం పట్టణంలోని ప్రధాన కూడళ్లలో ఏ నలుగురు కలిసినా సాగుతున్న ప్రధాన చర్చ ఇదే. కొత్తగూడెం నియోజకవర్గ అసెంబ్లీ బరిలో ప్రధానంగా బీఆర్ఎస్ నుంచి వనమా వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ బలపరిచిన సీపీఐ అభ్యర్థి కూనంనేని సాంబశివరావు, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే జలగం వెంకటరావులు ప్రధానంగా బరిలో ఉన్నారు. వీరి మధ్యనే హోరాహోరీ పోటీ నెలకొంది. ఎవరికీ ఏకపక్షంగా ఉండదని ఇక్కడ ముగ్గురు మధ్యనే తీవ్ర పోటీ ఉంటుందని పలువురు భావిస్తున్నారు. కొత్తగూడెం పట్టణంలోని గణేష్ టెంపుల్, సూపర్‌బజార్, రైల్వేస్టేషన్, పోస్టాఫీస్ సెంటర్, బస్టాండ్ సెంటర్, రామవరం, రుద్రంపూర్, విద్యానగర్, బైపాస్‌రోడ్ కూడళ్లలో ప్రతీరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో చాలామంది చేరుకుని ఈ ఎన్నికల ముచ్చట్లలో ఆసక్తిగా పాల్గొంటున్నారు. నియోజకవర్గంలో గత అయిదేళ్లలో జరిగిన అభివృద్ధిని ప్రస్తావిస్తూనే, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై పలువురు చర్చించుకుంటున్నారు. ఇక వివిధ పార్టీల మేనిఫెస్టోలను బేరీజు వేస్తున్నారు. గతంలో తమకు లభించిన పథకాలపై కొందరు చర్చిస్తుంటే... మరికొందరు తమకేమీ పథకాలు అందలేదని అసంతృప్తిగా ఉన్నారు. ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తూనే అప్పుడప్పుడు కాస్తా రాష్ట్ర రాజకీయాలపైనా వాదోపవాదాలు, చర్చలు జరుపుతూ సాసేపు ఆనందంగా గడుపుతున్నారు.